# చేనేత రుణాలు మాఫీ అమలు చేయాలి.

## చేనేతకు కేటాయించిన "11రకాల రిజర్వేషన్లు" అమలు జరపాలి

**CPM**

**చేనేత కార్మిక సోదరీ సోదరులారా!**

### టి.డి.పి. చేసిన వాగ్దానాలేంటి?

వ్యవసాయం తరువాత చేనేత వృత్తి ఎక్కువ మందికి జీవనోపాధి కల్పిస్తున్నరంగం. చేనేత రంగాన్ని ఉపాధి రంగంగా గుర్తించకుండా పాలకులు చేనేతను ధ్వంసం చేస్తున్నారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అధికారానికి వచ్చిన బిజెపి, తెలుగుదేశం పార్టీలు చేనేతను రక్షిస్తామని చేనేత కార్మికుల జీవన ప్రమాణం పెంచుతామని ప్రకటించాయి. చంద్రబాబునాయుడు తన ఎన్నికల ప్రణాళికలో చేనేత వర్గాలకు వరాల జల్లు కురిపించారు. చేనేతకు వెయ్యికోట్ల రూపాయలు బడ్జెట్‌లో కేటాయిస్తానని - అంత్యోదయ కార్డులు ఇచ్చి 35కిలోల బియ్యం ఉచితంగా ఇస్తానని, మగ్గం షెడ్‌తో కూడిన ఇళ్ళ నిర్మాణం చేపడతానని అందుకు లక్షన్నర రూపాయలు కేటాయిస్తానని, వృద్ధ చేనేత కార్మికులకు ఉరవకొండ, చీరాల, మంగళగిరి, పెడన, ధర్మవరం పట్టణాలలో వృద్ధాశ్రయాలు ప్రత్యేక ఆసుపత్రులు ఏర్పాటు చేస్తానని, చేనేత వస్త్రాలపై 30% రిబేటు సౌకర్యం కల్పిస్తానని వాగ్ధానం చేశారు.

### వాగ్దానాల అమలేది బాబు?

ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం రోజున రైతు, డ్వాక్రా రుణాలతోపాటు చేనేత రుణాలు రద్దుచేస్తానని తొలి సంతకం చేశారు. అధికారానికి వచ్చి సంవత్సరం పూర్తయింది. ఇచ్చిన హామీ ఒక్కటీ అమలు జరపలేదు. 2014 బడ్జెట్‌లో 99కోట్ల 87లక్షల రూపాయలు కేటాయించారు. అందులో చేనేత వర్గానికి ఒక్కపైసా ఖర్చు పెట్టలేదు. మరల 2015లో 46కోట్ల రూపాయలు మాత్రమే బడ్జెట్‌లో కేటాయించారు. ఇవి రుణాల రద్దుకు 174 జివో విడుదల చేశారు. అందులో చేనేత ప్రస్తావన లేదు. కనుక అధికారం కొరకు ఓట్ల కొరకు వాగ్ధానాలు చేసి ఓట్లు దండుకుని అధికారానికి వచ్చిన తర్వాత చేనేతలను మోసం చేశారనేది స్పష్టం.

గతంలో చంద్రబాబు ఉదారవాద విధానాలు సంస్కరణలను అమలు చేయటంలో భాగంగా హైటెక్కు యుగంలో గుంటమగ్గం అక్కర్లేదని చేనేత వారంతా పవర్‌లూమ్‌లకు వెళ్ళాలని పవర్‌లూమ్‌లను ప్రోత్సహించారు. ఆనాడు ధర్మవరంలోని పట్టునేత కార్మికుల మగ్గాలు లక్షదాకా మూతపడ్డాయి. చేనేత కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళన చేసి పవర్‌లూమ్‌లను ధ్వంసం చేశారు.

మరల ఈనాడు చంద్రబాబు అధికారానికి రాగానే పవర్‌లూమ్ యజమానులు రంగప్రవేశం చేశారు. ఈ సంవత్సర కాలంలో 70వేల మగ్గాలు అనంతపురం జిల్లాలో మూతపడ్డాయి. చేనేతకు కేటాయించిన 11రకాల రిజర్వేషన్లు ప్రభుత్వం అమలుచేయటం లేదు. దీనితో పవర్‌లూమ్ పోటీకి చేనేత తట్టుకునే పరిస్థితి లేదు. చేనేత వస్త్ర నిల్వలు పేరుకుపోయి మాస్టర్ వీవర్సు చేనేత కార్మికులకు పని చూపించలేని పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా 30మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. చేనేత కార్మికులు ఆకలి చావులకు గురయ్యే పరిస్థితి దాపురించింది.

జిల్లాలో మాస్టర్ వీవర్స్ వద్ద పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం (మజూరి) లభించడంలేదు. మాస్టర్ వీవర్స్ తయారు చేస్తున్న వస్త్రాలు మార్కెట్‌లో పవర్‌లూమ్ పోటీకి తట్టుకోలేక గుట్టలుగా పేరుకుపోతున్నాయి. సహకార సంఘాలలో తయారు అవుతున్న వస్త్రాలను ఆప్కో కొనుగోలు చేసి డబ్బు చెల్లించకపోవడంతో సహకార సంఘాలు కార్మికులకు పని చూపించలేని పరిస్థితి ఏర్పడింది.

చేనేత కార్మికులకు అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రకటించిన తెలుగుదేశం ప్రభుత్వం ఆచరణలో ఒక్కటి కూడా అమలు జరపడంలేదు. జీవిత భీమా పథకం క్రింద చదువుకున్న పిల్లలకు స్కాలర్‌షిప్‌లు 2సంవత్సరాలనుండి విడుదల కాలేదు. రెండు సంవత్సరాలనుండి హెల్త్‌కార్డులపై వైద్యం జరగడంలేదు. చేనేత కార్మికులకు ఇస్తున్న 25కిలోల ఉచిత బియ్య 3నెలలనుండి ఇవ్వడంలేదు. కనుక చేనేత కార్మికుల జీవన ప్రమాణ మెరుగుదలకు చేనేత కార్మికులంతా ఐక్యంగా పోరాడటం తప్ప మరోమార్గంలేదు. అందుకు ఆగష్టు 14న మండల కేంద్రాల్లో, కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో చేనేత కార్మికులంతా పాల్గొనాలని సిపియం విజ్ఞప్తి చేస్తున్నది.

డిమాండ్స్ :

1 చేనేత రుణాలు 202కోట్లను రద్దు చేయాలి.

2 సహకార సంఘాల వద్ద, మాస్టర్ వీపర్ల వద్ద నిల్వ ఉన్న కోట్ల రూపాయల వస్త్రాలను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి వెంటనే డబ్బు చెల్లించాలి.

3 చేనేత కార్మికులకు ఇళ్ళస్థలాలు ఇవ్వాలి. ఇళ్ళు నిర్మించాలి.

4 చేనేత కార్మికులకు హెల్త్‌కార్డులివ్వాలి.

5 మహాత్మాగాంధీ బున్‌కర్ యోజన స్కీం క్రింద చదువుతున్న పిల్లలకు స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి.

6 మహాత్మాగాంధీ బున్‌కర్ యోజన స్కీం లబ్దికి వయస్సు 70సం॥లకు పెంచాలి. పరిహారం లక్షన్నరకు పెంచాలి.

7 అంత్యోదయ కార్డులు ఇచ్చి 35కిలో బియ్యం ఉచితంగా ఇవ్వాలి.

8 వృద్ధ చేనేత కార్మికులకు ఎన్నికల ప్రణాళికలో ప్రకటించినట్లు ఉరవకొండ, చీరాల, మంగళగిరి, పెడన, ధర్మవరం పట్టణాల్లో వృద్ధాశ్రయాలు, ప్రత్యేక ఆసుపత్రులు ఏర్పాటు చేయాలి.

9 చేనేత కార్మికులకు 8గంటల సాదాపనికి రూ.300/-లు మజూరి ఉండేలా చట్టం చేయాలి.

10 చేనేతకు కేటాయించిన 11రకాల రిజర్వేషన్‌లు అమలు జరపాలి.

11 రాజీవ్ విద్యా మిషన్ ద్వారా బడిపిల్లలకు ఉచితంగా చేనేత వస్త్రాలు ఇవ్వాలి.

12 సహకార సంఘాలు తయారుచేసిన వస్త్రాలపై 30% రిబేటు 365రోజులు ఇవ్వాలి.

13 రెండు సంవత్సరాల నుండి పెండింగ్‌లో ఉన్న సహకార సంఘాలకు రావాల్సిన 20% యార్న్ సబ్సిడీలు వెంటనే ఇవ్వాలి. త్రిఫ్టుఫండు డబ్బులు విడుదల చేయాలి.

14 సొసైటీలకు రావాల్సిన రిబేటు డబ్బులు పావలా వడ్డీ డబ్బులు వెంటనే ఇవ్వాలి.

అభివందనములతో...

తేది :15.07.2015

**భారత కమ్యూనిస్టు పార్టీ ( మార్క్సిస్టు)**

**ఆంధ్రప్రదేశ్ కమిటీ**